
కథ

# నువ్వు నాకు నచ్చావ్!



**కోలపల్లి ఈశ్వర్**

నేనైతే అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదుగానీ, సౌమ్య ఎలా ఫీలవుతుందో! ఎంతైనా తొలిరాత్రి అనేది జీవితంలో మరచిపోలేని మధురస్మృతి. ఆడపిల్ల ఈ రేయి గురించి ఎన్నెన్నో కలలు కంటుందనీ, ఆశాసౌధాలు నిర్మించుకుంటుందనీ అంటారు. నిజమే మరి!

కనీ, ప్రేమ పంచీ, పెంచుకున్న తల్లిదండ్రులనూ, ఆడీపాడీ అల్లరి స్నేహంలో మమతానురాగాలను పంచుకున్న తోబుట్టువులనూ... అందరినీ వదిలి... ఒక్కరోజులో... తుఫానుకు కొట్టుకుపోయి తెలియని తీరానికి చేరిన నావలా... అపరిచితుని ఇంట్లో శాశ్వతంగా ఉండిపోవడానికి వస్తుందే... ఆ అమాయక హృదయంలో... తన భర్త ప్రవర్తన గురించి ఎంత టెన్షన్ ఉంటుందో కదా!

సౌమ్య గదిలోకి వచ్చింది. ఒక్కసారి అటుచూస్తే, ఎందుకోగానీ చెప్పలేని సంతృప్తి కలిగింది. సౌమ్యని చూడ్డానికి ముందు నలుగురు అమ్మాయిల్ని చూసినా వాళ్లెవరూ నచ్చలేదు. అమ్మ, చెల్లి, నాన్న, బావ... అందరూ సంబంధం పట్ల అయిష్టత చూపినవారే. సౌమ్యని పెళ్లి చేసుకుంటానంటే పిచ్చివాడిని చూసినట్టు చూశారు.

"అప్సరసల్లాంటి అమ్మాయిల్ని కాదనీ, లక్షాధికార్ల పిల్లల్ని వద్దనీ చివరికి ఈ అమ్మాయిని చేసుకుంటానంటున్నావ్! ఏముందిరా ఆ అమ్మాయిలో నీకంతగా నచ్చిందీ?" అంది అమ్మ బాధమిళితమైన కోపంతో.

"తెలీదమ్మా! సౌమ్యంటే ఇష్టం కలిగింది. అంతకుముందు చూసిన అమ్మాయిలు కంటికే నచ్చారు. సౌమ్య మనసుకు నచ్చింది" అన్నాను ఏం చెప్పాలో అర్థంకాక.

'ఎవరి పిచ్చి వారికానందం' అని బావ గొణుక్కుంటూ వెళ్లడం తెలుసు. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లుగా... అన్నయ్యకి పెళ్లిచూపుల్లో ప్రేమపుట్టింది' కామెంట్ చేసింది చెల్లి.

నా నిర్ణయం కొంచెం అసాధారణంగా మారినందుకు నేను కూడా చేసిన పని తప్పా, ఒప్పా అని మరోసారి ఆలోచించాను. కానీ అలా ఆలోచించడం తప్పని గ్రహించాను.

చెల్లి చెప్పినట్టు ఇది పెళ్లిచూపుల ప్రేమేమో!

"హలో..." పలకరించాను పుస్తకంలోంచి.

సౌమ్య నవ్వింది. అమ్మాయిల సాంగత్యం నాకు కొత్తకాదు. డిగ్రీ చదువుతున్నప్పుడు, సాఫ్ట్‌వేర్‌లో ప్రోగ్రామర్‌గా మారిన తరువాత కూడా నిత్యం ఎందరో

## పాత ప్రేమికుల కొత్త జంట!

**పూ**జాబత్రా, అక్షయ్‌కుమార్ చాలా కాలం క్రితం గాఢప్రేమికులన్న సంగతి అందరికీ గుర్తుండే వుంటుంది. అక్కీ ప్రేమజాలంలో పడిపోయి కెరీర్లు పాడు చేసుకున్న బాలీవుడ్ నటీమణుల్లో పూజ కూడా వుంది. బట్టలు మార్చినట్లుగా ప్రేయసులను మార్చుకుంటూ పోయి చివరికి అక్కీ, ట్వింకిల్‌ను పెళ్లాడేసి బుద్ధిమంతుడైన భర్తగా స్థిరపడ్డాడు. ఇటీవల సింధీ షోమాన్ పహ్లాజ్ నిహలానీ తీస్తున్న కొత్త చిత్రంలో అక్కీ, పూజతో కలిసి నటించబోతున్నాడు. నిజానికి అసలు హీరోయిన్ కరీనాకపూర్. సెకెండ్ హీరోయిన్ పూజాబత్రా. తమాషా ఏమిటంటే, కరీనే ఇద్దరితోనూ మాట్లాడుతూంది కానీ, పూజఅక్షయ్ పరస్పరం అస్సలు మాట్లాడుకోవటమే లేదట. మరీ చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తున్నారు కదూ? అని జనం గుసగుసలు పోతున్నారట. అసలు మాట్లాడుకోని ఈ పాతప్రేమికుల జంటతో తీసే సినిమా కూడా మూకీసినిమాలా తయారవుతుందేమిటి చెప్మా?

ఎస్.



అమ్మాయిలతో మాట్లాడటం, కలసి కేంటిన్‌లో గడపటం అలవాటే. అప్పుడు వాళ్లెవరిపైనా వేరే దృష్టిలేదు. పెళ్లి, భార్య... ఈ అధ్యాయం వేరు.

కట్టుకున్న పెళ్లాం మొదటిసారి పక్కన వచ్చి కూర్చుంటే ఆమెలో అందాన్ని శోధించటం, ఆమెలోని ఆకర్షణలకు ఉబ్బితబ్బిబ్బయి పోవడం నిజజీవితంలో జరుగుతుందా? ఈ క్షణంలో... వేడెక్కుతున్న కాంక్షల్ని ఎంత త్వరగా చల్లార్చుకుందామా అనే తపనే అణువణువునా ఆక్రమించదా?

కానీ ఎందుకో సౌమ్యని చూస్తే దీనికి విరుద్ధమైన భావన కలుగుతున్నది. సౌమ్య నవ్వితే ఏమనిపిస్తోంది?

పూలపై మంచురాలినట్లుగా, వానచినుకు నీటిలో జారి మృదువైన అలలు వలయాలుగా వ్యాపించినట్లుగా, చల్లని పిల్లతెమ్మెర మదిని తాకిపోయినట్లుగా... హాయిగా ఉంది. సౌమ్య నవ్వులో ఆత్మీయత ఉంది.

సౌమ్య నవ్వినపుడు చిన్నగా పూలరెక్కలా కనురెప్పలు ముడుచుకోవడం... ఏ వర్ణనతో హృదయగానాన్ని ఆవిష్కరించాలి? ఆమె నుదుటిపై భాగాన పాపిట నడుమ అమర్చిన కుంకుమ ఎంత ఆకర్షణీయంగా ఉందో ఎలా చెప్పేది!

"థాంక్స్..." చిన్నగా చిరునవ్వుతో ముంచి చెవికందించిన తీయనిమాట... సౌమ్య పరిచయ వాక్యం! ఆ గొంతులో ప్రతిఫలించిన స్వచ్ఛమైన కృతజ్ఞతకి కొలమానాలెందుకు!

"ఎందుకు?" అడిగాను.

"మీకు నేను నచ్చినందుకు!"

"మీరు నాకు నచ్చితే అది మీలో గొప్పతనమే కదా! మళ్లీ నాకు థాంక్స్ చెప్పడం ఎందుకు?"

"మీరా?" నేను తనని 'మీరా' అంటున్నందుకు ఆమె ఆశ్చర్యం!

"అవును... నీకు నేను 'మీరు' అయినంత వరకూ... నాకు నీవూ మీరేగా!"

సౌమ్య నవ్వింది.

"అలాగా! సరే... ఎలా ఉన్నాను?"

"ఫరవాలేదు"

"అలా అంటే నేనుడుక్కుంటాననా మీ ఆశ? ఉన్నదిఉన్నట్టుగా చెప్పే మీ నిజాయితీకి అభినందనలు."

"సౌమ్యా! ఒకమాట చెప్పనా? ఇల్లు అందంగా ఉండాలి... జీవితాంతం అందులో ఉంటాం కాబట్టి! వేసుకునే దుస్తులు అందంగా ఉండాలి... ఎదుటివారికీ, మనకీ ఆనందంగా ఉంటుంది కాబట్టి. కానీ ఒక ఫ్రెండ్ అందంగా ఉండాలని అనుకుంటామా? జీవితం చివరిదాకా నువ్వు, నేను స్నేహితులం. ఈ స్నేహానికి అందంతో పనేముంది! ఎప్పుడూ మొహాలు చూసుకోవాలి కాబట్టి ఒక మాదిరి అందం ఉంటే చాలదూ! నీకు నేను అసహ్యంగా కనిపించకుంటే చాలు... నాకు నువ్వు కూడా అలాగే ఉంటే చాలు... ఏమంటావ్!"

"మీ ఫిలాసఫీ బాగుంది. నా ఊహ తప్పుకాలేదు."

"ఏమనుకున్నావ్?"

"మీరు మంచివారని"

"సరేలే! కానీ సౌమ్యా... నీలో ఏదో ఆకర్షణ ఉంది... అదేమిటో నేను స్పష్టంగా కనుక్కోలేకపోతున్నాను."

సౌమ్య సిగ్గుపడింది... ఆ ఆకర్షణ ఆ సిగ్గులో ఉందా అనిపించేలా!

"చెప్పు సౌమ్యా ఏమిటాలోచిస్తున్నావు?"

"ఆదర్శాలు కొన్ని అల్పాయుష్షు గలవి. కాలం గడిచినకొద్దీ అవి తెలివితక్కువ నిర్ణయాలుగా కనిపిస్తాయని మా ఫ్రెండ్ అంటూండేది. ఏదో ఒక సందర్భంలో నాపై కోపం వచ్చినపుడు, 'నిన్ను కట్టుకుని జీవితంలో సుఖం కోల్పోయానే' అంటే...?"

"తప్పు! పెళ్లయ్యాకే అందం రెట్టింపయిన వాళ్లనెందరినో చూశాను. అయినా నీ అందం పోనూ పోనూ మరింత ఇనుమడిస్తుందే కానీ తగ్గదు."

"నా గురించి బాగా పరిచయం ఉన్నవాడిలా మాట్లాడుతున్నారే!"

"అదే ప్రేమలో గొప్పతనం!"

"ప్రేమా!?"

"యస్... నిన్ను పెళ్లిచూపుల్లో ప్రేమించాను."

"ఇలా ఎన్నాళ్లు ప్రేమిస్తారు?" చిలిపిగా అంది సౌమ్య, గడియారం వైపు చూస్తూ.

"కాలమున్నంత కాలం"

తొలిరాత్రి పరిచయం... స్నేహంగా మారాక ఇష్టాయిష్టాలు అనుభూతులు పంచుకోవడం... మనసు విప్పి మాట్లాడుకోవడం అయ్యాకనే భౌతికంగా ఇద్దరు మనుషులు దగ్గరవడం... ఇదే అసలైన ఆనందం.

000

"అమ్మా...! అమ్మా...! సౌమ్యా! అమ్మెక్కడ?"

"ఏంటన్నయ్యా, ఏం కావాలి? అమ్మ డాబాపై వడియాలు పెడుతోంది." చెల్లి రమ సమాధానం.

"ఆకలవుతుందే"

"వదిన పెడుతుందిగా" రమ విస్తుపోతూ అడిగింది.

"ముందు అమ్మను పిలు" అంటూ భోజనానికి కూర్చున్నాను. అమ్మ వచ్చింది.

"అదేమిట్రా సౌమ్యను పెట్టమనకపోయావా?" అమ్మ మాటల వెనుక, దాచాలన్నా ఆగకుండా బయటపడుతున్న మాతృహృదయపు గర్వం, అందులో నుండి ఎగసిన ఆనందం.

"అమ్మా! సౌమ్య ఇవ్వాళ వచ్చింది. నువ్వు అమ్మవి. నువ్వు నా దగ్గర ఉండగా నువ్వే అమ్మగా తినిపించాలి. నువ్వు నాకు అందుబాటులో లేనప్పుడు సౌమ్యేకదా నాకు అమ్మగా మారి తినిపించేది!" అమ్మ చేతిముద్దలో అమృతాన్ని ఆస్వాదిస్తూ నేను అన్నమాటలు అమ్మకు కళ్లనీళ్లు తెప్పించాయి.

"సరేలే మాటలు బాగా నేర్చావుగానీ... అస్తమానూ అలా అంటే సౌమ్యకు బాధగా ఉండదూ? కట్టుకున్న భార్యకి, తనే భర్తకు దగ్గరుండి భోజనం వడ్డించాలనుంటుందిరా! సాయంత్రం సౌమ్యను తీసుకుని ఎటైనా వెళ్లిరా" అంది ఆప్యాయంగా అమ్మ.

000

బిర్లామందిర్...

ఊరంతా... తెల్లని రంగులో నల్లని కాన్వాసుపై వేసిన ముచ్చటైన బొమ్మలా ఉంది.

ఆ చీకట్లో...

నియాన్ బల్బుల కాంతి తన అందమైన ముఖబింబంపై పడి ప్రతిఫలిస్తుంటే... తెల్లని చీరలో సౌమ్య... వెన్నెల బొమ్మలా ఉంది. పక్కనుంచి వెళ్లే అబ్బాయిలు నమ్రతగా తప్పుకుంటుంటే, అమ్మాయిలు వెళ్తున్నవాళ్లు క్షణం సేపు వెనక్కి తిరిగి చూస్తున్నారు మమ్మల్ని.

"మీరు అందరినీ కాదని నన్ను చేసుకున్నందుకు నేనెంతో భయపడ్డాను..." సౌమ్య అంది.

"నీకెలా తెలుసు?"

"ఎలాగో తెలిసింది గానీ... ఇప్పుడు ఆ భయం అర్థం లేనిదని గ్రహించాను."

"ఎలా గ్రహించావు?"


"చాల్లెండి... తెలిసీ అడుగుతారు! ఒక నిర్ణయం తీసుకోవడంలో ధైర్యం, అది నెరవేరడానికి కావలసిన ఓర్పు, చాకచక్యం కూడా మీకు ఉన్నాయని నాకు అర్థమైంది" అంది సౌమ్య ప్రశంస నిండిన కళ్లతో.

"సౌమ్యా! నువ్వంటున్నది దేని గురించో నాకు తెలుసు. కానీ ఒక్కమాట విను. అంతకాలం కలిసివున్న వాళ్లని, కన్నవాళ్లని వదలి నా ఇంటికి వచ్చిన నువ్వు... ఎంత బాధలో ఉంటావో నాకు తెలుసు. ఇంటికి వచ్చిన కోడలు, మొగుడినీ, అత్తనీ అర్థం చేసుకుని నడుచుకోవాలని హితోపదేశాలు చెబుతారు చాలామంది. కానీ అది అర్థంలేని మాట.

ఇంతకాలం నా కన్నవాళ్లు, నావాళ్లు నన్నెంతో ప్రేమగా చూసుకున్నారు. ఇవాల్టినుండీ నువ్వు నా జీవితంలో ముఖ్యమైన దానివి. అలాగే నీకు నేను కూడా! ఒక్కసారిగా మనం మన వాళ్లనుండి బంధాలను తెంచుకుని దూరమైపోతున్నట్టు వాళ్లకి తెలిస్తే వాళ్ల హృదయాలు తట్టుకోలేవు. అలా జరిగినప్పుడే తెలియని కోపం, కక్ష, ద్వేషం పుట్టి, అందులో నుండి కలతలు, సమస్యలు చెలరేగుతాయి. అందుకే క్రమక్రమంగా... వాళ్లనుండి మనం మనంగా వేరై నిలదొక్కుకోవాలి. వాళ్లు మావాళ్లు, మీవాళ్లు కాదు... ఇప్పుడు మనవాళ్లు. కానీ మనం మనమే. ఈ సూత్రాన్ని అర్థం చేసుకోవడమే జీవితం" అన్నాడు.

"అందుకే మీరు నాకు నచ్చారు" అంది సౌమ్య నవ్వుతూ.

"అందుకే నువ్వు నాకు నచ్చావు" అన్నాను సౌమ్యతో కలసి నడుస్తూ. ■




చెప్పబోతున్నారట స్టార్ ప్లస్ ఛానెల్ వారు. దాదాపు రెండేళ్లుగా నడుస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి?' కార్యక్రమానికి త్వరలో తెర పడబోతుందనే వార్త వేగంగా వ్యాపిస్తోంది. అనుకున్న కాంట్రాక్ట్ పూర్తి కావడంతో మెల్లమెల్లగా కెబిసి నాలుగు రోజుల నుంచి మూడు రోజులకు తగ్గిపోయింది. ఇప్పుడు మంగళబుధవారాలే నడుస్తోంది. 1 జనవరి 2002 నాడు ప్రసారం కాబోయే ఎపిసోడ్ కెబిసి కార్యక్రమానికి చివరిదవుతుందని చెప్పుకుంటున్నారు. మొదట్లో చాలా ఉత్సాహంగా జనం చూసి ప్రశంసించారు, ఇంకా ప్రశంసిస్తూనేవున్నారు. జనంలో "క్యా కియా జాయే?, ష్యూర్? కాన్ఫిడెంట్? పక్కా? లాక్ కియాజాయే?" వంటి డైలాగులు చాలా మామూలుగా చోటు చేసుకున్నాయి. సరదాగా మాట్లాడుకునే మాటల్లో కూడా ఇవి చెప్పుకుంటూ అమిత్‌జీని గుర్తు తెచ్చుకుని ఆనందించేవారు. క్రమంగా ఇతరకార్యక్రమాలు ఇలాంటివి కూడా వచ్చేశాక'జీతో ఛప్పర్ ఫాడ్‌కే, ఖుల్ జా సిమ్ సిమ్, నీలామ్ ఘర్ బిడ్ బిడ్ బూమ్', దీన్ని చూసేవారు తగ్గారు. ప్రచారం కోసం అమితాభ్ బచ్చనే స్వయంగా ఎవరింటికో వెళ్లినట్లూ, చూడమని చెప్పినట్లూ రకరకాలుగా అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా తీసి చూపించారు. అయినా జనం పెద్దగా చూడలేదనే చెప్పుకున్నారు. ఎందుకంటే ఇతరకార్యక్రమాల్లో బహుమతులు గెలుచుకోవటం ఇంకా సులువు కావటమే! అడ్వర్టయిజ్‌మెంట్లలో నటించినందుకు బిగ్ బీ తీసుకుంటున్న డబ్బు చాలా భారీగానే వుంటుందనీ అనుకుంటున్నారు. వినటానికి బాగానే వున్నా, అంత పెద్ద మెగాస్టార్ స్టేటస్‌కు ఎంత సిగ్గుచేటుఅని కూడా అంటున్నారు. ఏది ఏమైనా, కెబిసి అయిపోతున్నదంటే గంభీరవిగ్రహంగా అందరి మనసుల్లోనూ తిష్ట వేసుకున్న బిగ్ బీ అమితాభ్ బచ్చన్ మరి కనబడరని అందరికీ కాస్త దుఃఖంగానే వుంది. మంచి వాటికి త్వరగానే వీడ్కోలు చెప్పాల్సి వస్తుందన్న సంగతి అందరూ ఎరిగిందేగా!

ఎస్.